# పండుగముచ్చటలు

కందుకూరి రామభద్రరావుగారు

౧

"మొన్నమానాన్నవస్తే మనంకలిసివస్తామని సాగనంపేరు. మనంపండగకువెళ్ళడంమాటయేమిటి?"అని రమణ కాటుకకన్నులతో చుఱుకుచూపులుచూచి, తాంబూలారుణరాగముతో వియ్యమందిన మధురాధరమున రుచిరహాసములదొడగినది పందిరిమంచము మీఁద నొయ్యారముగాఁ బండుకొని వార్తాపత్రికఁ జదువుచున్న నారాయణరావు విననటులనటించి కిమ్మనలేదు బారెడుదూరమున టేబిలుమీఁద పింగాణి "వేస్"లో నగరువత్తులనంటించి, పేముకుర్చీలోఁగూర్చుండి యెదుట నిలువుటద్దములోఁ జూచి సవరించుకొనుచు "మాటాడరేఁ" అన్నది రమణ మెల్లగా.

"ఆఁ ఏమిటే?" అన్నాఁడు నారాయణరావొక పత్రముఁ దిరుగవైచుచు

"ఇలాంటిమాట లసలువినఁబడవు మీకు పాపం"

పత్రికమడచి టేబిలు మీఁద పడవైచి, లేచి కూర్చుండి నారాయణరావు "నువ్వుశృంగారించుకొని ఆకుర్చీలోకూర్చుంటే రతీదేవీలాగున్నావు ఆలేఁతగులాబీరంగుచీర, అద్దకపంచు పొట్టిచేతుల రవిక, పలకసరములు, ఆ వదులువాలుజడతో అసలే చక్కనిచుక్కవైన నిన్నుచూస్తే-" అన్నాడు

"మీరుమాత్రము లేరేమిటి మన్మథమూర్తిలాగ ఆప్రక్కపాపిడి ఉంగరాల క్రాపింగుతో, స్పోర్టింగుషర్టుతొడుగుకొని, పేటంచు తెల్లపంచకట్టుకుని, గుండ్రని ముఖాన్ని నిలువుబొట్టుపెట్టుకొని, మంచంనడుమెక్కి ఆవిశాలనేత్రాలతో నావైపుచూస్తోంటే ఈగొడవంతాయెందుకు? నా మాటకు సమాధానం చెప్పక?"

"ఏమిటినీమాట?"

"మనం దసరాపండుగకు వెళ్ళడం మాట"

"మనకిక్కడమాత్రం పండగకాదూ? వెళ్ళేదేమిటి?"

"ఇంటిదగ్గిరపండుగలు లేకేనేమిటి అల్లుళ్లు అత్తారిళ్ళకెళ్ళడం!"

"మనకిక్కడుంటే సంతోషంగాఉండేటప్పుడెందుకనివెళ్ళడం?"

"సంతోషంలేకనా? మావాళ్ళనోమాటుచూడాలనుందినాకు" "మొగుడెంత ప్రేమగాచూచుకుంటున్నా ఆడదానికి పుట్టింటిమీదనే ఉంటుందిధ్యానం స్త్రీబుద్ధి కుక్కబుద్ధి"

"మరే. అది ఆడదానికేఉండదండి. మీరు బి. యె చదువుతుంటే మనమిద్దరము రాజమండ్రిలో ఉండేటప్పుడు శనివారాదివారాలొస్తేమావాళ్ళని చూసొస్తానని తుఱ్ఱుమనేవారెందుకు? నేనంటే యిష్టంలేకేనా?"

"అంతే యెడ్డెమంటే తెడ్డమనడమొకటి నేర్చేవు"

"నేనేమన్నాను? భార్యాభర్తలకి ప్రేమున్నా కన్నవాళ్ళమీదప్రేమవుంటుంది. ఆప్రేమవేఱు, ఈప్రేమవేఱు అన్నానుకాని"

"నాకీశ్రీరంగనీతులు చెప్పనక్కఱలేదు. ఈసారి వెళ్ళడంలేదు"

"ఊరికేఅంటారు" అని రమణ మందహాసముతో నోరచూపులుచూచినది

"ఊరికేయేమిటినీమొహం? నిజమంటూంటే"

"ఈఒక్కమాటు నామాటవినండి" అన్నది రమణ దగ్గరకువెళ్ళి చుబుకముపుణుకుచు

నారాయణరావు మొగమటుత్రిప్పినాఁడు.

రమణ ఆతని వదనసరోజము తనవైపుత్రిప్పుకొనుచు "నాకేసియిల్లాచూడండీ —సరిగ్గా—నవ్వకుండా" అన్నది

నారాయణరావు కన్నుమన్నాఁడు.

రమణ తిరిగి కుర్చీలోకూలఁబడి "ఎప్పుడూఇదే సరసం" అని రోసరోసలాడినది కనుకొలికలనుండి యశ్రుకణములు బొటబొట కారఁజొచ్చినవి నారా

యణరావునకు రమణ కంటతడిఁబెట్టుట మనస్సు చివుక్కుమన్నది

"ఎందుకాబుడబుడదీర్ఘం అల్లాగే వెళ్ళవచ్చులే" అన్నాఁడు

"మీయిష్టం వెడితేవెళ్ళండి, మానితేమానండి"

"నేనూరికే యెందుకన్నానుకాని, నీకంతవెళ్ళాలనుంటే తప్పకుండావెడదాము" అన్నాఁడు మంచము దిగివచ్చి నారాయణరావు రమణకన్నులుతుడుచుచు

"మఱే యీకాసేపు అలాగేఅంటారు మళ్ళీ యెప్పటాలే" అన్నది రమణ

"ఒట్టు నీతోడు సప్తమినాఁడు బయలుదేఱి వెడదాం" అన్నాఁడు నారాయణరావు

గవాక్షమునుండి వారిసరసముచూచి నెలబాలుఁడు మందహాసమొనరించినాఁడు

౨

వీథియరుగుమీఁద తుంగచాపలుజంటగావేయించి పేకాడుచున్నారు నారాయణరావు, మామగారు కుటుంబరావు, మఱిముగ్గురును బడిపంతులువచ్చి రెండవయరుగుమీఁద కూర్చున్నాఁడు పిల్లలందఱు పంక్తులుతీరినిలబడి 'రాజాధిరాజ! యోరాజమార్తాండ!' అనుపద్యము రామంచెప్పగా వారందుకొని ఒకరికంటెఒకరు బిగ్గరగాఁజదవనారంభించిరి

"మేష్టారూ! ఒక్కమాటాపుచేయండి. క్రింద రెండుబేస్తులున్నాయి" అన్నారు పంచముఖపురాణపాఠకులలోనొకరు

పంతులుచెప్పగాఁ బిల్లలందఱూరకొనిరి ఆట పంపకమైనది

"మజాగాఉందండి పండుగబేరం" అన్నారొకరు

"ఏమండిమేష్టారు! మీరు గిలకలుపట్టించవచ్చా? అధికారులుచూస్తేతంటారాదూ? దశమినాడుకూడా విడిచిపెట్టకుండా తోముతున్నారు వాళ్ళని" అని ప్రశ్నించినాఁడు నారాయణరావు.

"రూలుప్రకారం పట్టించకూడదు ఎదోప్రాచీనాచారం మాకుపండుగకు మూడురోజులేనండి సెలవు అందుచేత ఏదో యీమూడురోజులు తిరగాలి. మఱిమమ్మల్నివాళ్ళు వాళ్ళనిమేము నమ్ముకున్నప్పుడు."

"అయ్యా! ఈయెలక్షన్లువచ్చాక బోర్డులు ఛండాలమైపోయాయి చివరకు కాంగ్రెస్పార్టీకేనా సిగ్గులేదు పట్టణంలోకీవస్తే రంగుబట్టచూచిన సంతపసువులులాగబెదరి, పొట్టచింపినా అక్షరంముక్కలేని దేవయ్యలనందఱిని మెంబర్లుగా ఎన్నుకొని, అందులో యేఓబయ్యనో ప్రెసిడెంటుగాపెడతారు. వాడి యిరకతరకలకు లెక్కలేదు చూడండి స్కూళ్ళసెలవులికియెన్ని అవకతవకపుమార్పులువచ్చేయో యీమధ్య వాళ్ళ వాడు ఏకస్సెన్నోచెప్పేడని మేష్టర్లని యిక్కడనుంచిఅక్కడకు అక్కడనుంచి యిక్కడికి, వడిసెలతో బెడ్డలువిసరినట్లు విసరడం."

"ఆడదామా? తీసేద్దామా? కుటుంబరావుగారూ! ఆమేష్టార్ని పంపించేయండి" అన్నారొకరు.

"కోపపడకండి ఈయనికి పేకాటంటే సరితిండేనాఅక్కరలేదు"

పిల్లలుపద్యముమఱల నారంభించిముగించిరి వెండి పళ్ళెరములోఁ గొబ్బరిబోండము తాంబూలము రెండు రూపాయలుపెట్టి శాంతమ్మ లోనుండి రామానికి సంజ్ఞచేయగా రామంపుచ్చుకుని పంతులకందించెను.

పంతులుపుచ్చుకొని "కుటుంబరావుగారూ! మీపద్దువరహావేసుకున్నాం" అన్నాఁడు

"ఈయేటికి అల్లాపోనీయండి రిట్రెంచిమెంటు"

"మీరేఅల్లాగంటే యెల్లాగు?"

"తరవాతచూద్దాంలెండి."

పంతులులేచి వెళ్ళుటకు నిలఁబడినాఁడోలేదో రామంగిలకలబద్దసాచి, గురిచూచికొట్టినాడు బావచెక్కిళ్ళమీఁద బుక్కా రామందారితీసిన ముహూర్తమాత్రములో ముప్పదిగిలకలబుక్కా నారాయణరావును ముంచెత్తివేసినది "ఆగండి, ఆగండి" అని నవ్వుచు వారినాపఁజూచిరి కాని ఆబాలానందము నాసమయమున బ్రహ్మఆపగలఁడా?

నారాయణరావు అత్తవారిచ్చిన క్రొత్తజామారుదులుపుకొనుచు, కళ్ళునలుపుకొనుచు, నోటపడినదాని నుమియుచు లేచి లోనికివెళ్ళినాఁడు.

"వసంతమూర్తిలాగున్నారే" అనినవ్వినది రమణ అక్కడ చేరిఉన్న ఆడువారందఱు పకపకమన్నారు

## 3

నారాయణరావుగదిలో టేబిలువద్దకూర్చొని వ్రాసికొనుచుండగా రమణ వెనుకనుండి పిల్లియడుగులతో వచ్చి కన్నులుమూసినది కలముబల్లమీఁదపెట్టి, కరకంకణములనుబట్టి రమణని గ్రహించి రెండుచేతులలో శిరమువంచి చెక్కిలిముద్దుగొన్నాడు నారాయణరావు రమణచేతులువదలి "మంచి సమాధానమే నేనెవరోచెపుతారను కున్నాను నోటితోచెప్పక చమత్కారంగా చెప్పేరే" అన్నది నవ్వుచురమణ

"చదువుకొని ఉద్యోగంలేకపోయినా యీమాత్రం చమత్కారం చేతకాదనుకున్నావా?"

"చదువుకుంటే చేతకాదు ఇల్లాంటిది చదువుకున్న సన్యాసులు చాలామంది ఉంటారు దానికేంగాని యేమిటిరాస్తున్నారు ఇందాకటినుంచి?"

"'గృహలక్ష్మి'కి వ్యాసంవ్రాస్తున్నాను"

"ఓహో! మీకవిత్వం! గృహలక్ష్మికివ్యాసం!"

"ఏం, అల్లాగంటావు. నీకేంతెలుసు నాసంగతి? కడవంతగుమ్మడికాయ కత్తిపీటకులోకువట మగవాడెంతటివాడైనా ఆడదానికళ్ళకి డఫేదారులాగ కనబడతాడు"

"ఊరికేవేళాకోళానికన్నాను. దానికంతఉలుకెందుకు? ఆడదెంతటిదైనా మగవాడికిమాత్రం దాసీలాగ కనబడదు? పోనీలెండి—మీకుకోపమొస్తుంది ఏమిటావ్యాసం?"

"'జమ్మిసవారీ' అనిదాని శీర్షిక"

"జమ్మిసవారా!" అని విరగబడినవ్వి "మీకు తగ్గట్టేఉంది. ఇదామీకు దొరికినవిషయం? ఏదేనా మంచికథవ్రాయాలి అంతేకాని జమ్మిసవారేమిటి నామొహం?"

"ఎద్దుకేంతెలుసు అటుకులరుచి? నేనెందుకువ్రాస్తున్నానో తెలుసా?"

"ఏదీకొంచెంచెప్పండి"

"మనదేశంలో గ్రామాలలో—అనేక సాంప్రదాయాలున్నాయి అవి క్రమంగా నశిస్తున్నాయి. అవి మతసాంఘిక పౌరాణిక ఆదర్శాలతో పుట్టాయి. అవి యిప్పటికవులువర్ణిస్తే నవీనులకు వాటి యందభిమానం పుట్టి ఉత్సాహంకలుగవచ్చు అదిగాకయీనాడు యిల్లాంటి ఆచారాలుండేవని, యీనాటిసాంఘిక జీవితంయిల్లాఉండేదని ముందుకొన్నితరాలుపోయిన తరవాత వాళ్ళకితెలుస్తుంది."

"ఔను. మీవ్యాసాలు అసలుఎవరేనాచదివితే, అమూల్యధనమని ఆచదివినవాళ్లు ముందువాళ్ళకోసం దాచిపెడితే, మీరుచెప్పింది బాగానేఉంది."

"వ్రాసీవాళ్ళంతా మనవి శాశ్వతంగా ఉంటాయనే వ్రాస్తున్నారేమిటి? నాఉద్దేశమే నాకు ప్రాధానము కాని ఉంటుందా, ఊడుతుందా అని నాకెందుకు?"

"సరేకాని, దీన్నిగురించి వ్రాయాలనితోచినందుకు చెప్పాలి."

"మొన్నమీఊరెళ్ళినప్పుడు నేనూ వెళ్ళేను గా దానికి. గోపాలస్వామిఆలయంలోకి రైతులంతా రావడం, భజంత్రీలతోటి, జేఘంటానినాదంతోటి, 'గోవిందా' అనే పౌరధ్వనితోటి దేవుణ్ణిపల్లకీలో బయలుదేరదీయడం, అప్పుడే ఆరి అడుగులుపడిన దారిలో వరుసగానడుస్తూ గోదావరిఒడ్డున లంకలో జమ్మిచెట్టుదగ్గరకుచేరడం, దానికి పూజ చేయడం, ఆపూజానంతరం "శమీశమైతేపాపం, " అనివ్రాసినతాటాకుముక్కలుకరణంగారుపంచిపెట్టడం, ముట్టదేమోనని రైతులు పోట్లాడిపుచ్చుకొని జమ్మికొమ్మలకు గ్రుచ్చడం, ఎన్నిగ్రుచ్చితే అన్నిరెట్ల పుణ్యం వస్తుందనుకోవడం, ప్రసాదంపంచిపెట్టడం, ఆనుషక్త గౌతమి యీధ్వనివిని నిద్రలోకలవరించడం, ఆశరత్కాలదశమీచంద్రుడు రైతులతోపాటు నవ్వుతూ ఆనందించడం, ఆపచ్చనిపైరుల రంగవల్లులు చూచేటప్పటికి నావళ్ళుపులకించి యిది వ్యాసంవ్రాయాలనుకున్నాను"

"మీమాటలువింటే నాకుపులకిస్తోంది. ఏదిచదవండి?"

"ఇంకాకొంచెముంది పూర్తికాగానే నీకు చదివి వినిపిస్తాకా."